## క్లుప్తంగా

### వేరుశనగ తీత పనుల్లో రైతులు బిజీ



వేరుశనగ తీత పనుల్లో మహిళలు

సీతానగరం: మండలంలో అడపాదడప కురుస్తున్న వర్షాలతో వేరుశనగ పంట తీత పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. మండలంలోని పీబీ పేట, జయంతిరాయపురం, దయానిధి పురం, గాదెలవలస తదితర గ్రామాల్లో తీత పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది వేరుశనగ దిగుబడులు బాగానే ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పంట తీసిన వెంటనే పచ్చి వేరుశనగ కాయలకు గిరాకీ ఉండడంతో పొలంలోనే వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని ఆనందపడుతున్నారు.

### వేతనం గిట్టుబాటు అయ్యేలా 'ఉపాధి'



రంగంపేటలో వేతనదారుల మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే వేతనదారులు వేతనం గిట్టుబాటు అయ్యేలా రెండు పూటలూ పని చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. రంగంపేట, కె.సీతారాంపురం, దయానిధిపురం, పణుకుపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. వేతనదారుల మస్తరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దినసరి వేతనం రూ.272లు గిట్టుబాటు అయ్యే విధంగా రెండు పూటలూ పని చేయాలని, సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ భాను, జేఈ కృష్ణ, సాంకేతిక సహాయకులు క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

### సందేశాత్మకం.. డావిన్సి కళాత్మక చిత్రాలు



మాట్లాడుతున్న చందనపల్లి గోపాలరావు

పార్వతీపురం టౌన్: డావిన్సి కళాచిత్రాలు అనేక శాస్త్రాలకు అవసరమైన ఎన్నో సందేశాలను అందించాయని ప్రముఖ చిత్రకారుడు చందనపల్లి గోపాలరావు అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో స్నేహకళా సాహితీ ఆధ్వర్యంలో డావిన్సి కళా జీవితం పుస్తక పరిచయం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధి చెందిన ఎన్నో చిత్రాలను నిర్మించారన్నారు. చిత్రకళపై అభిరుచి చిన్ననాటి నుంచే బయటపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు, రచయితలు ఎం.జగదీష్, పి.రవీంద్రనాథ్,ఎస్.స్వామినాయుడు, సీహెచ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### బాలేరులో పారిశుద్ధ్య పనులు



వీధికాలువల్లో పూడికలు తొలగిస్తున్న కార్మికులు

భామిని: మండలంలోని బాలేరులో బుధవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధి కాలువల్లో పూడికలు తొలగించి ట్రాక్టర్లతో డంపింగ్‌యార్డుకు తరలించారు. సర్పంచ్ జామి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మేడిబోయిన చలపతిరావు పనులను పర్యవేక్షించారు. వరుసగా వర్షాలు కురుస్తున్నందున వీధుల్లో మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

### రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రవేశాలు

కురుపాం: మండల కేంద్రంలోని శివన్నపేటలో ఉన్న గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 2023–24 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.సత్యవతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6వ తరగతిలో 11 సీట్లు, 7వ తరగతిలో 1 సీటు, 8వ తరగతిలో 4 సీట్లు, 9వ తరగతిలో 3 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాలకు చెందిన విద్యార్థులు ఏప్రిల్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9492450649 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికే 'ఆసరా'

- నియోజకవర్గానికి రూ.26.45 కోట్ల ఆసరా నిధులు
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మహిళల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని అందుకే అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత మంజూరైన రుణమాఫీ చెక్కులను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ముందుగా మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ఆసరాతో అక్కాచెల్లెమ్మలకు జగనన్న అండగా నిలిచారన్నారు. మహిళల జీవన ప్రమాణాలు మార్చాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. పార్టీలకతీతంగా డ్వాక్రా మహిళలందరికీ ఆసరా పథకం ద్వారా రుణమాఫీ చేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతలో భాగంగా పార్వతీపురం నియోజకవర్గానికి 4428 సంఘాలు చెందిన మహిళలకు రూ.26.45 కోట్లను అందజేశామన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు హైమావతి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మహిళ పక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆర్థికంగా ఆదుకున్నారు..

మాలాంటి పేదవారిని జగనన్న ఆర్థికంగా ఆదుకుంటున్నారు. మాలాంటి వారికి ఇలాంటి పథకాలు ఎన్నో అందుతు న్నాయి. చిన్న సంతోషాలతో సంబర పడిపోయే మాకు జగనన్న ఇస్తున్న కానుకల గురించి ఎంతచెప్పినా తక్కువే.

– ఎస్. లావణ్య, 3వ వార్డు, పార్వతీపురం

### మాట నిలబెట్టుకున్నారు...

గత చంద్రబాబు ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తామని మాటిచ్చి తప్పారు. పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మూడు విడతల్లో రుణమాఫీ చేయడం మా అదృష్టం. ఇటువంటి నాయకుడు కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలి.

– ఎ.కాంచన, లబ్ధిదారు, 19వ వార్డు

### పేదల ప్రభుత్వం

పేదల కోసం తపించే ఇటువంటి ప్రభుత్వమే మాకు కావాలి. చెప్పిన ప్రకారం అన్నీ ఇస్తున్నారు. ముఖ్యంగా స్వయం సహాయక బృందాలు తీసుకున్న రుణాలు కూడా జగనన్న కడుతున్నారు. 2017లో డ్వాక్రాలో చేరాను. తీసుకున్న మొత్తాన్ని కూడా దశల వారీగా ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ మరువను.

– గులిపల్లి లక్ష్మి, 21వ వార్డు, పార్వతీపురం



సమావేశానికి హాజరైన మహిళలు

# జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు



సాలూరు: జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: స్వాతంత్ర్య యోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయ వేత్త బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పట్టణంలో ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జర్జాపు ఈశ్వరరావు, కౌన్సిలర్‌లు తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరంలో, సంఘ సంస్కరణల్లో, రాజకీయ రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.

**సీతానగరంలో..**

సీతానగరం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి బుధవారం ఘనంగా జరిగాయి. మహనీయుని జయంతి ఉత్స వాలను పురస్కరించుకుని లచ్చయ్యపేటలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సిహెచ్.కృష్ణ, ఎంపీటీసీ సింహాచలం కలిసి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ కేంద్ర ప్రభుత్వంలో వివిధ శాఖలకు కేంద్ర మంత్రిగా ఉంటూ ప్రజలకు సేవలందించారని తెలిపారు.



సీతానగరం: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తదితరులు



బలిజిపేట: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

**బలిజిపేటలో...**

బలిజిపేట: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి బలిజిపేటలో ఘనంగా నిర్వహించారు. దళిత నాయకుల ఆధ్వర్యంలో బలిజిపేటలో చెరువుగట్టు వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బలిజిపేట చెరువు గట్టుపై జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు దళిత నాయకులు, పెద్దలు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైద్యుడు బి.కాశినాయుడు, ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, వి.సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జి.మురళి పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



జమదాల గ్రామంలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని జమదాల గ్రామంలో బుధవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదేనన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికలలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆయన ఇంటింటికీ వెళ్లి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ ఎం.భాగ్యశ్రీ, ఆత్మా చైర్మన్ వై.తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

సీతంపేట:

గ్రామ శివారున నిర్మిస్తున్న టీటీడీ దేవస్థానం పనులను దేవాదాయశాఖ డిప్యూటీ ఈఓ పి.వెంకటయ్య బుధవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులకు స్వామివారి దర్శనం కల్పించాలనే ఉద్దేశంతో ఇక్కడ టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు మహాసంప్రోక్షణ, ఇతర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట హిందూ ధర్మ ప్రచార పరిషత్ క్లస్టర్ సూపరింటెండెంట్ రవికుమార్, తదితరులు ఉన్నారు.



సూచనలిస్తున్న డిప్యూటీ ఈఓ వెంకటయ్య

# ప్రజలకు చేరువగా పోలీసులు



దోమ తెరలు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఆసుకుమారి

మక్కువ: ప్రజలకు చేరువయ్యేందుకు పోలీసు శాఖ తరచూ కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో భాగంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అసిస్టెంట్ కమాడెంట్ ఆసుకుమారి అన్నారు. మండలంలోని కోన గ్రామంలో బుధవారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్బుగెడ్డ, గోపాలపురం పంచాయతీ పరిధిలోని 200 మందికి దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్, పోలీసు శాఖ సంయుక్తంగా గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు, క్రీడా పోటీలు ఏర్పాటు చేయడంతో పాటు దుప్పట్లు, దోమతెరలు, క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. యువతీ యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామంలో ఎటువంటి గొడవలకు తావివ్వకుండా అంతా కలిసి కట్టుగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.షైడిరాజు, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' పనుల పరిశీలన

పాలకొండ రూరల్:

నిర్దేశిత సమయంలో ఉపాధిపనులు పూర్తిచేసేలా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రణాళికతో పనులు చేయించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు సూచించారు. పాలకొండ మండలం తుమరాడ, నవగాం, పొట్లి తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. వేతనదారులు క్రమం తప్పకుండా పనులకు హాజరుకావాలని, నిర్దేశించిన పనిని సకాలంలో పూర్తిచేయాలని అన్నారు. వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



తుమరాడలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

# ఘనంగా స్వామి దశమ వార్షికోత్సవం

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం (రెండవ రోజు) ఆలయ నిర్వాహకులు సీహెచ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ లక్ష్మీనృసింహస్వామి దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి నిత్యారాధనం, అగ్ని ప్రతిష్ఠ, తీర్థ ప్రసాద గోష్ఠి, సుదర్శన నరసింహయాగం, హోమపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం లక్ష్మీనృసింహస్వామి, వేణుగోపాల స్వాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణ మహోత్సవానికి ఆలయ నిర్వాహకులు చెలికాని గోపాలకృష్ణ దంపతులు 58 రకాల పిండి వంటలు తయారుచేసి స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆమంది శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, కె మురారి, బి.కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో యాగ పూజలు జరుగుతున్నాయని తెలిపారు.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

# వైఎస్సార్‌సీపీలో చేరిన ఇండిపెండెంట్ కౌన్సిలర్



ఇండిపెండెంట్ కౌన్సిలర్ బంగారునాయుడును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపాల్టీ 1వ వార్డు స్వంతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన కౌన్సిలర్ బంగారునాయుడు బుధవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆసరా కార్యక్రమం జరిగిన అనంతరం వేదికపై పార్టీ పరిశీలకులు శోభా హైమావతి సమక్షంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

# ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురం టౌన్:వైఎస్సార్‌సీపీ గృహసారథి గడి వెంకటరమణ కుమారుడు శేఖర్(40) గుండెపోటుతో అకాల మరణం చెందిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ కొండపల్లి రుక్మిణి, జేసీఎస్ కన్వీనర్ జి.మాదవరావు, నాయకులు కె.బాలకృష్ణ తదితరులున్నారు.

# 'జగనన్నే మా భవిష్యత్' పోస్టర్ విడుదల

పార్వతీపురం టౌన్:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున నియోజకవర్గ ప్రజలతో మమేకమయ్యే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ఈ నెల 7వ తేదీ నుంచి శ్రీకారం చుట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి జగనన్నే మా భవిష్యత్ పోస్టర్‌ను బుధవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తరపున సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నియామకం చేపట్టిన తరువాత ఒక మిషన్ మోడ్‌లో బాధ్యతాయుతంగా సుశిక్షితులైన సైనికుల్లా పని చేస్తే ఎలా ఉంటుందోనన్న విషయంపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం పనితీరుపై పార్టీ పట్ల ప్రజల అభిప్రాయాన్ని వారి సంతృప్తిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్టీ పని చేస్తుందన్నారు. ఈ నెల 7 నుంచి 20 వరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా 14రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సీనియర్ నాయకులు, పార్టీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ కోరారు. మండలంలోని అంపావల్లి, వంతరాం, గళావల్లి, గంగాడ సచివాలయాల పరిధిలోని జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. ప్రతి రోజు క్లస్టర్ల వారీగా 15 గృహాలను సందర్శించి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రజలకు సూచించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు జి.రాములనాయుడు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సీతానగరం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బి.చిట్టిరాజు కోరారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార సామగ్రి పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సచివాలయ కమిటీ సభ్యులకు, గృహ సారథులకు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, మండల వైస్సార్‌సీపీ వై.గోపాలనాయుడు, బూర్జ ఎంపీటీసీ జి చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం:గాదెలవలసలో సర్పంచ్ అన్నపూర్ణమ్మకు ప్రచార సామగ్రి అందజేత



సాలూరు: ప్రచార సామగ్రి విడుదల

సాలూరు: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ గిరిరఘు కోరారు. పట్టణంలో రామా కాలనీ వద్ద కౌన్సిలర్ హైమా విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ విధి విధానాలపై చర్చించారు. వీటికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.



అంపావల్లి సచివాలయంలో కిట్లు పంపిణీ చేస్తున్న మండల కమిటీ సభ్యులు